నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
13 | హైదరాబాద్, శుక్రవారం 1 మార్చి 2024 | YADADRI BHUVANAGIRI

కనుల పండువగా పాన్నోత్సవం

అర్వపల్లిలో స్వామి అమ్మవార్ల ఊరేగింపు

అర్వపల్లి, ఫిబ్రవరి 29 : అర్వపల్లి లోని యోగానంద లక్ష్మీనరసింహ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం అర్ధరాత్రి పాన్నోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. నారసింహుడు బాలకృష్ణుడి అవతారంలో, అమ్మవార్లు శ్రీదేవి, భూదేవి, గోపికల అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. గోపికలు కొలనులో స్నానమాచరిస్తుండగా బాలకృష్ణుడు వారి కోకలను దొంగిలించుకుపోయి పొన్న చెట్టుపై కూర్చున్న కార్యక్రమాన్ని అర్చకులు నిర్వహించారు. ఉత్సవం అనంతరం స్వామి, అమ్మవారి విగ్రహాలను పొన్న చెట్టుపై నుంచి పుర వీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ ఉత్సవ కమిటీ చైర్మన్ అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, డైరెక్టర్ కనుక రేణుక, మాజీ జడ్పీటీసీ కొరపిడత అవిలయ్యయాదవ్, రమేశ్, అర్చకులు రాంబాబు అయ్యంగార్, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాలో టీచర్ పోస్టులు 1,268

- యాదాద్రి భువనగిరి జిల్లాలో ఖాళీలు 277
- నల్లగొండ జిల్లాలో 605, సూర్యాపేటలో 386
- డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసిన ప్రభుత్వం

యాదాద్రి భువనగిరి, ఫిబ్రవరి 29 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర ప్రభుత్వం డీఎస్సీ-2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 11,062 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇస్తూ.. జిల్లాల వారీగా ఖాళీల వివరాలను ప్రకటించింది. ఆ మేరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1,268 పోస్టులు ఖాళీలు భర్తీ చేయనున్నది. యాదాద్రి భువనగిరి జిల్లాలో 277 పోస్టులు ఉన్నాయి. స్కూల్ అసిస్టెంట్ 84, లాంగ్వేజ్ పండిట్ 21, పీఈటీ 2, సెకండరీ గ్రేడ్ టీచర్ 137, స్కూల్ అసిస్టెంట్ (స్పెషల్ ఎడ్యుకేటర్లు) 10, సెకండరీ గ్రేడ్ టీచర్ (స్పెషల్ ఎడ్యుకేటర్లు) పోస్టులు 23 ఉన్నట్లు పేర్కొంది. నల్లగొండ జిల్లాలో 605, సూర్యాపేటలో 386 ఖాళీలను భర్తీ చేయనున్నది. కాగా, పాత డీఎస్సీ నోటిఫికేషన్‌ను ప్రభుత్వం బుధవారం రద్దు చేసిన విషయం తెలిసిందే. కొత్త నోటిఫికేషన్ ప్రకారం ఈ నెల 4 నుంచి ఏప్రిల్ 2 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నది. అప్లికేషన్ ఫీజును వెయి రూపాయలుగా నిర్ణయించింది. ఆన్‌లైన్ పద్ధతిలో పరీక్షలను నిర్వహించనున్నట్లు స్పష్టం చేసింది. ఇందుకు సంబంధించిన తేదీలను ప్రభుత్వం త్వరలో ప్రకటించనున్నది. గతంలో దరఖాస్తు చేసుకున్నోళ్లు మళ్లీ చేయాల్సి అవసరం లేదని, కొత్త డీఎస్సీకి పాత దరఖాస్తులను పరిగణలోకి తీసుకుంటామని నోటిఫికేషన్ పేర్కొంది.

స్వామివారికి నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

వైభవంగా యాదగిరీశుడి నిత్య తిరుకల్యాణోత్సవం

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 29 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామివారి క్షేత్రంలో స్వామి, అమ్మవార్ల నిత్య తిరుకల్యాణోత్సవం అత్యంత వైభవంగా సాగింది. గురువారం ప్రధానాలయ వెలుపలి ప్రకార మండపంలో స్వామి, అమ్మవార్లను దివ్య మనోహరంగా అలంకరించి గజ వాహనంపై వేంచేపు చేసి కల్యాణోత్సవ సేవను జరిపారు. కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్లను వెంచేపు చేసి కల్యాణ తంతు చేపట్టారు. లక్ష్మీసమేతుడైన నారసింహుడిని ఆరాధిస్తూ సుమారు గంటన్నరకు పైగా నిత్య తిరు కల్యాణ తంతు సాగింది. కల్యాణమూర్తులను ముస్తాబు చేసి భక్తులకు అభిముఖంగా అధిష్టించి నిత్య కల్యాణ తంతును నిర్వహించారు. భక్తులు పాల్గొని స్వామివారి కల్యాణోత్సవాన్ని వీక్షించారు. స్వామి, అమ్మవార్ల నిత్యోత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. గురువారం తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వయంభూ నరసింహస్వామిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి ఆరగింపు చేపట్టారు. ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. నిజరూప దర్శనంలో స్వయంభూ నారసింహస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. ప్రధానాలయ ముఖ మండపంలో ఉత్సవమూర్తుల పాదాల వద్ద 108 బంగారు పుష్పాలను ఉంచి అష్టోత్తర నామాలు పఠిస్తూ అర్చించారు. అనంతరం స్వామివారికి హారతినిచ్చి భక్తుల గోత్రనామాల పేరిట సంకల్పం చేశారు. వెలుపలి ప్రాకార మండపంలో స్వామి, అమ్మవార్లకు నిత్య తిరుకల్యాణోత్సవం శాస్త్రోక్తంగా జరిగింది. ప్రధానాలయ వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహహోమం జరిపిన అర్చకులు ఉత్సవమూర్తులను దివ్య మనోహరంగా అలంకరించి కల్యాణోత్సవ సేవను జరిపారు. సాయంత్రం స్వామివారికి తిరువీధిసేవ, దర్బార్ సేవ అత్యంత వైభవంగా చేపట్టారు. రాత్రి వేళ స్వామివారికి తిరువారాధన, తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన జరిపారు. పాతగుట్టలో స్వామివారికి నిత్యారాధనలు వైభవంగా సాగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. సుమారు 11వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ.18,53,945 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ రామకృష్ణారావు తెలిపారు.

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజా వ్యవహారాల సలహాదారు నరేందర్‌రెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆయన మనుమరాలి పుట్టు వెంట్రుకలను స్వామివారికి సమర్పించారు. స్వయంభూ పంచనారసింహస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా స్వామివారి విమానగోపురం స్వర్ణతాపడానికి కావాల్సిన బంగారం వివరాలను ఆలయ అర్చకులు, అధికారులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. గత ప్రభుత్వ హయాంలో సమకూరిన బంగారం, ఇంకా కావాల్సిన దానిపై ఆయనతో చర్చించారు. దీనిపై ఆయన స్పందిస్తూ త్వరలో సీఎం రేవంత్‌రెడ్డిని ఆలయానికి తీసుకొస్తామన్నారు. విమానగోపురానికి బంగారం తాపడం పనులు సకాలంలో పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయ డీఈఓ దోర్బల భాస్కర్‌శర్మ, ఏఈఓలు రఘు, రామ్మోహన్, పర్యవేక్షకులు రాజన్‌బాబు పాల్గొన్నారు.

ప్రయాణించిన దూరానికే టోల్ ఫీజు

- త్వరలో జీపీఎస్ ఆధారిత టోల్ విధానం
- ప్రస్తుత ఫాస్టాగ్ చెల్లింపులు కనుమరుగు
- ప్లాజాల వద్ద మరింత తగ్గనున్న ట్రాఫిక్
- జీపీఎస్‌తో ఉచిత ప్రయాణం లేనట్టే
- జిల్లాలో రెండు టోల్ ప్లాజాల ద్వారా ప్రయాణం

యాదాద్రి భువనగిరి, ఫిబ్రవరి 29 (నమస్తే తెలంగాణ) హైవేలపై ప్రయాణించే వాహనదారులు టోల్ గేట్ల వద్ద చెల్లించే టోల్ ఫీజు కొత్త విధానంలో అమల్లోకి రానున్నది. ఇప్పుడున్న ఫాస్టాగ్ సిస్టమ్‌కు స్వస్తి పలికి.. జీపీఎస్ ఆధారిత శాటిలైట్ విధానం తీసుకురానున్నారు. దాంతో టోల్ ప్లాజాల వద్ద ట్రాఫిక్ సమస్య తగ్గడంతోపాటు రహదారులపై ప్రయాణించిన దూరానికే టోల్ చెల్లించే వెసులుబాటు కలుగనున్నది. అంతే కాకుండా కొత్త జీపీఎస్‌తో కొంత దూరం వరకు ఇప్పుడు ఉచితంగా ప్రయాణిస్తున్న అవకాశం లేకుండా పోనున్నది. ఈ తరహా విధానంలో ఈ నెలలోనే అమలు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి.

టోల్ చెల్లింపులు ఇప్పుడిలా..

మారుతున్న కాలంతోపాటు ప్రజానీకానికి కొత్త టెక్నాలజీ అందుబాటులోకి వస్తున్నది. మూస పద్ధతులకు పుల్‌స్టాప్ పెడుతూ.. అద్భుతమైన సాంకేతిక చేరువవుతున్నది. 2019 కంటే ముందు టోల్‌ప్లాజాల వద్ద నగదు రూపంలోనే టోల్ చార్జీలు వసూలు చేసేవారు. ఆ తర్వాత ఫాస్టాగ్ విధానం అందుబాటులోకి వచ్చింది. వాహనాలు టోల్ బూత్ వద్దకు రాగానే క్షణాల్లోనే పేమెంట్ జరుగుతున్నది. ప్లాజాల వద్ద ఉన్న సెన్సార్లు ఫాస్టాగ్‌ను స్కాన్ చేసుకోవడం ద్వారా చెల్లింపులు కొనసాగుతున్నాయి. దీని ద్వారా టోల్ ప్లాజాల వద్ద ట్రాఫిక్ రద్దీ తగ్గింది. ఫాస్టాగ్ లేకుంటే నగదు ద్వారా రెండింతలు చెల్లించాల్సి ఉంటుంది. ప్రస్తుతం యదాద్రి జిల్లాలో రెండు టోల్ ప్లాజాలు ఉన్నాయి. హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారిపై బీబీనగర్ మండలంలోని గూడూరు వద్ద, హైదరాబాద్-విజయవాడ రహదారిపై చౌటుప్పల్ మండలంలోని పంతంగి వద్ద టోల్ ప్లాజాలు ఉన్నాయి.

కొత్త జీపీఎస్ టోల్ ఇట్ల..

ప్రస్తుతం ఉన్న ఫాస్టాగ్ విధానానికి కేంద్రం స్వస్తి పలుకనున్నది. దాని స్థానంలో జీపీఎస్ ఆధారిత టోల్ చార్జ్‌లను అమలు చేయాలని నిర్ణయించింది. ఇప్పటికే దేశంలోని పలు చోట్ల పైలెట్ ప్రాజెక్ట్‌గా అమలు చేస్తున్నది. ఈ నెల నుంచి దేశ వ్యాప్తంగా అమలు చేస్తామని ఇప్పటికే కేంద్ర రవాణా శాఖ మంత్రి నితీన్ గడ్కరీ స్పష్టం చేశారు. కొత్త విధానం ప్రకారం వాహనం ప్రయాణించిన దూరం ఆధారంగానే టోల్ చెల్లించాలి. సదరు వాహనం ఎన్ని టోల్ ప్లాజాలు దాటిందో ఈ జీపీఎస్ వ్యవస్థ నమోదు చేస్తుంది. దాని కోసం వాహనంలో ఓ డివైస్ అమర్చుకోవాలి. దీని ఆధారంగా వాహనం కదలికను ట్రాక్ చేస్తారు. రహదారి ఎగ్జిట్ పాయింట్‌కు చేరుకోగానే ప్రయాణించిన దూరాన్ని బట్టి టోల్ ఫీజు కట్ అవుతుంది. రహదారులపై ప్రయాణించే దూరాన్ని బట్టి టోల్ చెల్లించే విధానం ప్రస్తుతం అందుబాటులో లేదు. వాహనదారులు ఫిక్స్‌డ్ టోల్ కడుతున్నారు. తక్కువ దూరం ప్రయాణించినా టోల్‌ప్లాజా దాటితే మొత్తం రుసుము చెల్లించాల్సి వస్తున్నది. జీపీఎస్ టోల్ విధానంలో వాహనదారుడు తన వాహనం, పేరు రెండూ రిజిస్టర్ కావాలి. బ్యాంక్ అకౌంట్‌తో అనుసంధానం చేసుకోవాలి.

ఉచిత ప్రయాణాలు బంద్..

జీపీఎస్ టోల్ అమల్లోకి వస్తే ఉచిత ప్రయాణానికి చెక్ పడనుంది. ఉదాహరణకు.. వరంగల్ హైవే ఘట్‌కేసర్ నుంచి ప్రారంభమవుతుంది. అక్కడి నుంచి వచ్చే వాళ్లు గూడూరులో టోల్ కట్టాల్సి ఉంటుంది. గూడూరు కంటే ముందే బీబీనగర్ తదితర ప్రాంతాలకు వెళ్లాల్సిన వారు టోల్ చెల్లించాల్సిన అవసరం ఉండదు. ఇదే విధంగా చౌటుప్పల్ వరకు ప్రయాణించి అట్నుంచి సంస్థాన్‌నారాయణపురం, గట్టుప్పల్ వైపు వెళ్లే వాహనదారులు ఇప్పుడు టోల్ కట్టడం లేదు. జీపీఎస్ విధానం వస్తే ఎంత దూరం ప్రయాణిస్తే అంత దూరం చెల్లించాల్సి ఉంటుంది.

మున్సిపల్ బడ్జెట్ సమావేశంలో పాల్గొన్న పాలక మండలి సభ్యులు

యాదగిరిగుట్ట మున్సిపల్ బడ్జెట్ ₹ 16.64కోట్లు

- ఆమోదం తెలిపిన కౌన్సిల్

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 29 : యాదగిరిగుట్ట మున్సిపాలిటీ 2024-25 ఆర్థిక సంవత్సరం ముసాయిదా బడ్జెట్‌కు పాలక మండలి సభ్యులు ఆమోదం తెలిపారు. పురపాలక సంఘం కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఎరుకల సుధాహేమేందర్‌గౌడ్ అధ్యక్షతన గురువారం బడ్జెట్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా 2023-24 ఆర్థిక సవరణ బడ్జెట్ అంచనాలు, 2024-25 ఆర్థిక సంవత్సరం ముసాయిదా బడ్జెట్ అంచనాలను అమోదిస్తూ ఏకగ్రీవ తీర్మానం చేశారు. వచ్చే ఏడాది ఆదాయ, వ్యయాలను సంక్షిప్తంగా వివరించారు. మార్చి 2024 నాటికి ప్రారంభ నిల్వ రూ.18.18 లక్షలు, 2020-25లో పన్నుల అంచనా ఆదాయం రూ.3,52,70,000, ఇతర పన్నులు రూ.9,33,80,000 కలిపి మొత్తం రూ.13,04,68,000గా అంచనా వేశారు. గ్రాంట్ల అంచనా రూ.1.50కోట్లు, ఇతర గ్రాంట్ల అంచనా రూ.2.10కోట్లు, ఆదాయం రూ.3.60 కోట్లతో కలిపి మొత్తం ఆదాయం రూ.16,64,02,000గా అంచనా వేశారు. వచ్చే ఏడాదికి మొత్తం రూ.16,45,02,000 ఖర్చు చేయనున్నారు. ఇందులో రూ.19.66 లక్షలు మిగులు బడ్జెట్ అంచనా రూపొందించి ఆమోద ముద్ర వేశారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మేడబోయిన కాటంరాజు, కమిషనర్ అజయ్‌కుమార్‌రెడ్డి, కౌన్సిలర్లు గొలికార్ అరుణ, సీస విజయలక్ష్మి, గుండ్లపల్లి వాణి, సురేందర్, మాలోతు సరోజ, ముక్కర్ల మల్లేశ్, దండబోయిన అనిల్‌యాదవ్, కో ఆప్షన్ సభ్యులు పేరబోయిన పెంటయ్య, ఎస్‌డీ బాబా, గోర్ల పద్మ, రిజ్వానా, అధికారులు నవీన్, అబ్దుల్, మునీమ్ అహ్మద్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు కె.జెండగే

ఐదేండ్లలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయాలి

- మార్చి 3న పల్స్‌పోలియో : కలెక్టర్ హనుమంతు కె.జెండగే

భువనగిరి కలెక్టరేట్, ఫిబ్రవరి 29 : అప్పుడే పుట్టిన వారి నుంచి ఐదేండ్లలోపు పిల్లలందరికీ మార్చి 3న పల్స్ పోలియో చుక్కలు వేయించాలని జిల్లా కలెక్టర్ హనుమంతు కె.జెండగే సూచించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో పల్స్ పోలియో ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మార్చి 3న ఆదివారం జాతీయ పోలియో దినోత్సవం (నేషనల్ ఇమ్యూనైజేషన్ డే) పురస్కరించుకొని జిల్లాలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలన్నారు. జిల్లాలో 63,405 మంది 0- 5 సంవత్సరాల్లోపు చిన్నారులను గుర్తించినట్లు తెలిపారు. వారందరికీ 21 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో 420 సెంటర్ల ద్వారా పోలియో చుక్కలు వేయనున్నట్లు తెలిపారు. ఇందుకోసం 1,680 మంది సిబ్బందిని, 68 మంది రూట్ సూపర్‌వైజర్లను నియమించినట్లు చెప్పారు. 56 మొబైల్ టీములు కూడా పని చేస్తాయన్నారు. వీటితోపాటు బస్టాండ్లు, రైల్వేస్టేషన్, జన సమూహాలు అధికంగా ఉండే 17 ట్రాన్సిస్ట్ ప్రాంతాలను, 319 హైరిస్క్ ఏరియాలను గుర్తించడం జరిగిందని, ప్రతి ఒక్క చిన్నారికి పోలియో చుక్కలు వేయడం జరుగుతుందని తెలిపారు. మార్చి 3న పోలియో డ్రాప్స్ వేయని చిన్నారులకు 4, 5 తేదీల్లో ఇంటింటికీ తిరిగి వేస్తారన్నారు. ఐదు సంవత్సరాల్లోపు తమ చిన్నారులకు పోలియో చుక్కలు వేయించాలని, పోలియో నివారణకు కృషి చేయాలని తల్లిదండ్రులకు సూచించారు. సమావేశంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ పరిపూర్ణాచారి, జిల్లా పరిషత్ సీఈఓ శోభారాణి, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ వంశీకృష్ణ, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి యాదయ్య, విద్యాశాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు.

మేళ్లచెర్వు జాతరకు అన్ని ఏర్పాట్లు చేయాలి

- కలెక్టర్ వెంకట్రావ్

ఎన్ఎస్పీ అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట్రావ్

మేళ్లచెర్వు, ఫిబ్రవరి 29 : మార్చి 8 నుంచి 12 వరకు మేళ్లచెర్వులో జరుగనున్న మహాశివ రాత్రి జాతరకు వచ్చే భక్తులకు తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని కలెక్టర్ వెంకట్రావు సూచించారు. ఆలయ ఆవరణలో జాతర ఏర్పాట్లపై గురువారం పలు శాఖల అధికారులు, నాయకులతో ఆయన సమీక్ష నిర్వహించారు. క్యూ లైన్లు, పారిశుధ్యం, ట్రాఫిక్ నియంత్రణపై శ్రద్ధ చూపాలన్నారు. జాతర మొదలయ్యే సమయానికి పనులు పెండింగ్ లేకుండా చూడాలని, లిఫ్ట్ ద్వారా గ్రామ శివారులోని ఎన్ఎస్పీ కాల్వలోకి నీటిని విడుదల చేయాలని సంబంధిత ఉన్నతాధికారులను ఫోన్‌లో ఆదేశించారు. అనంతరం ఆలయ పరిసరాల్లో ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీఈఓ అప్పారావు., డీపీఓ సురేశ్, తాసీల్దార్ జ్యోతి, ఎంపీడీఓ ఖాజా అజ్గర్ అలీ, ఎస్ఐ పరమేశ్, ఈఓ కొండారెడ్డి, నాయకులు కొట్టె సైదేశ్వర్‌రావు, శాగంరెడ్డి గోవిందరెడ్డి, భాస్కర్‌రెడ్డి, శంభిరెడ్డి, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

నల్లగొండ జిల్లాలో పోలీస్ యాక్ట్

- నెల రోజుల పాటు అమలు

నీలగిరి, ఫిబ్రవరి 29 : నల్లగొండ జిల్లాలో శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకొని ఈ నెల 1 నుంచి 30 వరకు నెల రోజుల పాటు 30, 30(ఎ) పోలీసు యాక్ట్-1861 అమలు చేస్తున్నట్లు ఎస్పీ చందనా దీప్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ముందస్తు అనుమతి లేకుండా ప్రజలు, ప్రజా ప్రతినిధులు ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్‌లు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని సూచించారు. శాంతి భద్రతలకు భంగం కలిగే విధంగా, ప్రజాధనానికి నష్టం కలిగించే, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు చేపట్టరాదని పేర్కొన్నారు. ప్రజలు, ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాల సహకరించాలన్నారు.

వలిగొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని పరీక్ష కేంద్రంలో తనిఖీ చేసి వస్తున్న జిల్లా ఇంటర్ బోర్డు అధికారి రమణి

ఇంటర్ సెకండియర్ పరీక్షలు ప్రారంభం

భువనగిరి అర్బన్/ వలిగొండ, ఫిబ్రవరి 29 : ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం వార్షిక పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 30 కేంద్రాలు ఏర్పాటు చేయగా.. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష నిర్వహించారు. మొదటి రోజు సెకండియర్ తెలుగు, హిందీ, ఉర్దూ, సంస్కృతం పరీక్షలు జరిగాయి. జిల్లాలో మొత్తం 5,891 మంది విద్యార్థులకు గాను 5,724 మంది పరీక్షకు హాజరయ్యారు. 167 మంది గైర్హాజరైనట్లు జిల్లా నోడల్ ఆఫీసర్ సి.రమణి తెలిపారు. జనరల్ కోర్సులో 4,600 మందికిగాను 4,519 మంది హాజరు కాగా, 81 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 1,291 మంది విద్యార్థులకు గాను 1,205 మంది హాజరు కాగా, 86 మంది విద్యార్థులకు పరీక్ష రాసేందుకు రాలేదు. వలిగొండ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, లోతుకుంట మోడల్ కళాశాలలోని పరీక్ష కేంద్రాలను స్పెషల్ ఫ్లయింగ్ స్క్వాడ్‌తోపాటు జిల్లా ఇంటర్ బోర్డు అధికారి రమణి తనిఖీ చేశారు.

ఎన్నికల కోడ్ ముగిసినా సూర్యాపేట కలెక్టరేట్‌లోని శిలాఫలకాలపై తొలగని ముసుగులు

ఎవరి మెప్పు కోసమో ఈ ముసుగులు!

- ఎన్నికల కోడ్ ముగిసినా కలెక్టరేట్ శిలాఫలకాలపై తీయని తెరలు

సూర్యాపేట, ఫిబ్రవరి 29 : ఎన్నికల కోడ్ సమయంలో నియమామళి ప్రకారం రాజకీయ నాయకులు, ప్రముఖుల విగ్రహాలు, అభివృద్ధి పనులు శిలఫలాలు, రాజకీయ పార్టీల దిమ్మెలు కనిపించకుండా తెరలు కట్టడం తెలిసిందే. కోడ్ ముగిశాక వాటిని తీసి ప్రజలకు కనిపించేలా ఉంచుతారు. కానీ జిల్లా ఎన్నికల అధికారిగా వ్యవహరించిన కలెక్టర్ ఉండే సూర్యాపేట కలెక్టరేట్‌లోనే ఎన్నికల కోడ్ ముగిసినా శిలాఫలకాలపై తెరలను తీయలేదు. పరిపాలన సౌలభ్యం కోసం కేసీఆర్ సర్కారు కొత్త జిల్లాలను ఏర్పాటుచేసి, సమీకృత కలెక్టరేట్లను నిర్మించింది. అందులో భాగంగా సూర్యాపేట జిల్లా కేంద్రంలో కట్టిన కలెక్టరేట్‌కు అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ స్వయంగా శంకుస్థాపన, ప్రారంభోత్సవం చేశారు. ఆ వివరాలను పేర్కొంటూ ఏర్పాటుచేసిన శిలాఫలకాలను ప్రజలకు కనిపించేలా ముఖద్వారాం వద్ద ఏర్పాటుచేశారు. 2023 శాసనసభ ఎన్నికల కోడ్ సందర్భంగా వాటిపై ముసుగులు కప్పిన అధికారులు కోడ్ ముగిసి ముడు నెలలు పూర్తవుతున్నా తిరిగి తీయకపోవడం గమనార్హం. రోజు కండ్ల ముందు కనిపించే ముసుగులను తీయకపోవడం వెనుక కారణం ఏంటి, అధికార పార్టీ నేతల మెప్పు కోసమే ఇలా చేస్తున్నారా అని కలెక్టరేట్‌కు వచ్చిన ప్రజలు బహిరంగంగానే మాట్లాడుకుంటున్నారు.

సబ్సిడీ గ్యాస్‌పై గందరగోళం

- అధికారులకే క్లారిటీ లేకుండా పథకం ప్రారంభం
- నల్లగొండ జిల్లాలో మహాలక్ష్మి కింద 4.60 లక్షల దరఖాస్తులు
- గ్యాస్ కనెక్షన్లు ఉన్న వినియోగదారుల సంఖ్య 6.18 లక్షలు
- రేషన్ కార్డు ఉన్నోళ్లకే సబ్సిడీ గ్యాస్ అని ప్రకటించిన సర్కార్

నల్లగొండ, ఫిబ్రవరి 28 : గృహ వినియోగం గ్యాస్ సిలిండర్ 500 రూపాయలకే ఇస్తామని ఎన్నికల హామీల్లో ఊదరకొట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం స్పష్టత లేకుండానే ఈ పథకానికి శ్రీకారం చుట్టింది. ఈ నెల 27న ఆదరా బాదరాగా ప్రారంభించినా పథకం విధి విధానాలు ప్రకటించకపోవడంతో అర్హులు ఎవరనే విషయం అయోమయంగా మారింది. పథకాన్ని అమలుచేయాల్సిన అధికార యంత్రాంగానికి సైతం దీనిపై క్లారిటీ లేకపోవడం గమనార్హం. రాష్ట్ర వ్యాప్తంగా 40లక్షల మందికే సబ్సిడీ గ్యాస్ ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడంతో జిల్లాలో ఎంత మందికి వస్తుంది, వచ్చే జాబితాలో తమ పేరు ఉంటుందా, అసలు ఏ ప్రామాణికంగా ఇస్తారు అనే ప్రశ్నలపై జనంలో చర్చ నడుస్తున్నది. నల్లగొండ జిల్లాలో 6.18 లక్షల మంది ఎల్‌పీజీ గ్యాస్ వినియోగదారులు ఉండగా.. అందులో మూడు లక్షల మందికి మాత్రమే వచ్చే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తున్నది. ప్రజాపాలన కార్యక్రమంలో మహాలక్ష్మి పథకం కింద సబ్సిడీ గ్యాస్ కావాలని 4.60 లక్షల మంది దరఖాస్తు చేసుకోగా అందులో మూడు లక్షల కుటుంబాలకు మించి వచ్చే అవకాశం లేదని స్పష్టమవుతున్నది. కాగా, జిల్లాలో రేషన్ కార్డుదారులు 4.67 లక్షల మంది ఉన్నారు.

రేషన్ కార్డే ప్రామాణికం..

నల్లగొండ జిల్లాలో ప్రజాపాలన కింద మహాలక్ష్మి పథకంలో సబ్సిడీ వంట గ్యాస్ కోసం 4.60 లక్షల కుటుంబాలు దరఖాస్తు చేసుకున్నాయి. అందులో మూడు లక్షల కుటుంబాలకు మించి మాహాలక్ష్మి పథకం వర్తించే అవకాశాలు కనిపించడం లేదు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీల అమలు కోసం గత ఏడాది డిసెంబర్ 28 నుంచి ఈ ఏడాది జనవరి 6వరకు ఆశావహుల నుంచి దరఖాస్తులు స్వీకరించింది. ఆయా పథకాలు కావాలని జిల్లాలో 5.35 లక్షల మంది దరఖాస్తు చేసుకోగా.. ప్రధానంగా సబ్సిడీ గ్యాస్ కోసం 4.60 లక్షల కుటుంబాలు అప్లికేషన్లు పెట్టుకున్నాయి. అయితే.. సబ్సిడీ గ్యాస్ కావాలంటే ప్రభుత్వం తెల్ల రేషన్ కార్డు తప్పనిసరి చేయడంతో దరఖాస్తుదారుల్లో కొంత మంది అనర్హతకు గురికానున్నాయి. ఇక దరఖాస్తులో గ్యాస్ నెంబర్ వేయని వారు, ఒకే గ్యాస్ నెంబర్ అన్నాదమ్ములు, తల్లిదండ్రుల, కొడుకులు, ఇతర కుటుంబ సభ్యులు వేసిన వారిలో ఎవరు అర్హులో కూడా చెప్పలేని పరిస్థితి. ఒక ప్రాంతంలో గ్యాస్ నెంబర్ ఉండి ఉపాధి పొందుతున్న మరో ప్రాంతంలో దరఖాస్తు చేసుకున్న వారికి ఇస్తారా.. లేదా? అనే దానిపై అధికారులకే క్లారిటీ లేదు. దీంతోపాటు ఆదార్ నెంబర్ కూడా ట్యాలీ కావాల్సి ఉంది. ఇన్ని కొర్రీల మధ్య సబ్సిడీ గ్యాస్‌కు ఎవరు అర్హులో.. ఎవరు అనర్హులో ఒకసారి గ్యాస్ బుక్ చేసుకుంటే గానీ తెలియని పరిస్థితి.

డీబీటీ పద్ధతిలో సబ్సిడీ..

డీబీటీ పద్ధతిలో సబ్సిడీ ఇస్తున్నామని.. మీ బ్యాంకు ఖాతాల్లో రాయితీ డబ్బు వేస్తామని చెప్పి దశాబ్ద కాలంగా వినియోగదారులను కేంద్రం చేస్తున్న దగా తెలిసిందే. ప్రస్తుతం గ్యాస్ సిలిండర్ ధర రూ.974 ఉండగా.. రూ.46.88 సబ్సిడీ రూపంలో వినియోగదారుల ఖాతాల్లో జమ చేస్తున్నట్లు కేంద్ర సర్కార్ చెబుతున్నప్పటికీ అది ఖాతాల్లో పడుతుందో, లేదో తెలియని పరిస్థితి. ఇదే పద్ధతిని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తామని ప్రకటించి మొదటగా వినియోగదారులే చెల్లించి గ్యాస్ తీసుకుంటే ఆ తర్వాత రూ.500 పోను మిగిలిన సబ్సిడీ ఖాతాల్లో వేస్తామని ఊదరగొడుతున్నది. ఈ సబ